క్లుప్తంగా

విద్యార్థులు సత్ప్రవర్తన కలిగి ఉండాలి

హుజూర్‌నగర్ : విద్యార్థులు సత్ప్రవర్తన కలిగి ఉండాలని ఎస్‌ఐ ముత్తయ్య అన్నారు. బుధవారం హుజూర్‌నగర్ పట్టణంలోని డీబీ స్కూల్‌లో విద్యార్థులకు మత్తు పదార్థాలు, సైబర్ నేరాలపై అవగాహన కల్పించి మాట్లాడారు. విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండి బుద్ధిగా చదువుకోవాలని సూచించారు. ట్రాఫిక్ నిబంధనలు, రోడ్డు ప్రమాదాలు, దొంగతనాల వల్ల జరిగే అనర్థాలు, వివిధ చట్టాల గురించి ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్‌ఐ రమేష్, హెచ్‌ఎం, ఉపాధ్యాయులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక

మునగాల : మండలంలోని వెంకట్రాంపురం గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ యువజన నాయకుడు కాసాని నాగేంద్రబాబు బీఆర్‌ఎస్‌ను వీడి బుధవారం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కొప్పుల జైపాల్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు కాసర్ల కోటేశ్వరరావు, మండల ప్రధాన కార్యదర్శి జిల్లేపల్లి వెంకటేశ్వర్లు, యూత్ కాంగ్రెస్ నాయకుడు కోట దానియేలు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఎన్నిక రద్దుపై హర్షం

హుజూర్‌నగర్ : హుజూర్‌నగర్‌లో ఈనెల 16న నిర్వహించిన సమావేశంలో ప్రకటించిన జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఎన్నిక చెల్లదని జిల్లా కబడ్డీ అసోసియేట్ అడహక్ కమిటీ చైర్మన్ భూలోకరావు ప్రకటించడం హర్షణీయమని స్థానిక కబడ్డీ క్రీడాకారులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఎన్నిక ప్రక్రియ పారదర్శకంగా లేదని, కబడ్డీ క్రీడాకారులకు సమాచారం లేకుండా ఏర్పాటు చేశారని తెలిపారు.

పురాతన ఆలయం కూల్చివేత



శ్రీసీతారామచంద్రస్వామి ఆలయాన్ని కూల్చివేసిన ప్రదేశం

చిలుకూరు : మండలంలోని బేతవోలు గ్రామంలో పురాతనమైన శ్రీసీతారామచంద్రస్వామి దేవాలయాన్ని కూల్చివేశారు. గత రెండు రోజులుగా కూల్చివేత పనులు కొనసాగుతుండగా బుధవారం పూర్తయ్యాయి. కాగా, ఆలయంలోని స్వామివార్ల విగ్రహాలను బాలాలయంలో ప్రతిష్ఠించి పూజలు నిర్వహిస్తున్నారు. ఆలయం కమిటీ ఆధ్వర్యంలో నూతన దేవాలయ నిర్మాణానికి శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించనున్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నేరేడుచర్ల : మండలంలోని దిర్శించర్ల గ్రామంలో గల 33కేవీ సబ్ స్టేషన్, ముకుందాపురం సబ్ స్టేషన్‌లలో మరమ్మతులు చేపడుతున్నందున ఆయా సబ్ స్టేషన్ల పరిధిలోని ప్రాంతాల్లో గురువారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని నేరేడుచర్ల ట్రాన్స్‌కో ఏఈ పందిరి శ్రీనివాస్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

మానవ జీవితంలో సైన్స్ పాత్ర కీలకం

హుజూర్‌నగర్ : మానవ జీవితంలో సైన్స్ పాత్ర కీలకమని జన విజ్ఞాన వేదిక రాష్ట్ర బాధ్యుడు పీవీ దుర్గాప్రసాద్ తెలిపారు. సైన్స్ వారోత్సవాల్లో భాగంగా బుధవారం హుజూర్‌నగర్ లోని ఎమ్‌డీఆర్, శ్రీ చైతన్య పాఠశాలలో విద్యార్థులకు జీవపరిణామ సిద్ధాంత ఆవశ్యకతను ఆయన వివరించారు. కార్యక్రమాలలో జిల్లా ప్రధాన కార్యదర్శి కలకుంట్ల సైదులు, హెచ్‌ఎంలు ఎస్ భూపాల్ రెడ్డి, పీవీ రమణారావు, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

యూత్ కాంగ్రెస్ గ్రామ కమిటీల నియామకం



తిమ్మారెడ్డిగూడెంలో నూతన కమిటీకి నియామకపత్రం అందజేస్తున్న సాయి

మునగాల : మండలంలోని కొక్కిరేణి, తిమ్మారెడ్డిగూడెం, గణపవరం గ్రామాల్లో బుధవారం యూత్ కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీలను నియమించారు. కొక్కిరేణి గ్రామ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులుగా పిల్లి నరేష్, కామళ్ల పవన్, గణపవరం గ్రామ అధ్యక్ష, కార్యదర్శులుగా మేడం దుర్గాప్రసాద్, పచ్చిపాల నాగరాజు, తిమ్మారెడ్డిగూడెం గ్రామ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులుగా కొచ్చర్ల భరత్‌బాబు, తిమ్మారెడ్డి మధుసూదన్‌రెడ్డిలతో పాటు కార్యవర్గాన్ని నియమించారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కొప్పుల జైపాల్‌రెడ్డి సహకారంతో నూతన కమిటీలను నియమించినట్లు యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తక్కెళ్లపాటి సాయి తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షుడు అమరబోయిన మట్టయ్యయాదవ్, పార్టీ నాయకులు కాలె సామియేలు, పోటు అశోక్, నాయకులు పచ్చిపాల శ్రీను, బూసిపల్లి శ్రీనివాసరెడ్డి, సూరేపల్లి రమేష్, షేక్ పాషా, మునగలేటి వీరబాబు, పచ్చిపాల నవీన్ పాల్గొన్నారు.

అనుమతులొచ్చినా.. అసంపూర్తిగానే!

- నిలిచిన సర్వీస్ రోడ్డు నిర్మాణం
- ఏళ్లుగా రాకపోకలకు ఇబ్బందులు
- హైవేపై తరచూ ప్రమాదాలు
- పట్టించుకోని జీఎమ్మార్ అధికారులు



మునగాలలో సర్వీస్ రోడ్డు లేక హైవేపై నుంచి రాకపోకలు సాగిస్తున్న స్థానికులు

మునగాల : మండల కేంద్రంలో హైవేకు ఇరుపక్కల సర్వీస్ రోడ్డు నిర్మాణం అసంపూర్తిగా మిగిలింది. జాతీయ రహదారిని నాలుగు లేన్లగా విస్తరించిన జీఎమ్మార్ సంస్థ సర్వీస్ రోడ్డు నిర్మాణాన్ని పూర్తి చేయలేదు. దీంతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. మునగాలలో ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మించడంతో రహదారికి ఇరువైపులా దాదాపు రెండు కి.మీ మేర సర్వీస్ రోడ్డు నిర్మాణం చేపట్టాల్సి వచ్చింది. దీంతో సర్వీస్ రోడ్డు నిర్మాణం చేపట్టినా స్థానిక మజీద్ వద్ద మాత్రం సుమారు 300 మీటర్ల మేర నిర్మించకుండా వదిలేశారు. దీంతో నారాయణగూడెం, కృష్ణానగర్ గ్రామాల ప్రజలతో పాటు ఈ ప్రాంత ప్రజల రాకపోకలకు ఇబ్బందిగా మారింది.

అనుమతులొచ్చి ఏడాదైనా..

అయితే సర్వీస్ రోడ్డు పెండింగ్‌లో ఉన్న 300 మీటర్ల ప్రాంతంలో ఖబ్రస్తాన్, మసీదు ఉంది. సర్వీస్ రోడ్డు నిర్మిస్తే ఖబ్రస్తాన్‌లోని సమాదులు కూలగొట్టాల్సి వస్తుందని స్థానిక మసీదు కమిటీ రోడ్డు నిర్మాణానికి అభ్యంతరం తెలిపారు. దీంతో ఆ ప్రాంతంలో సర్వీస్ రోడ్డు నిర్మాణం నిలిచిపోయింది. జీఎమ్మార్ సంస్థ కూడా దీనిని సాకుగా తీసుకొని నిర్మించలేదు. రోడ్డు విషయమై స్థానికులు పలుమార్లు అధికారులకు వినతిపత్రాలు ఇచ్చారు. ఎట్టకేలకు సర్వీస్ రోడ్డు నిర్మాణానికి వక్ఫ్‌బోర్డు నుంచి ప్రభుత్వ అధికారులు అనుమతి పొందారు. ఖబ్రస్తాన్‌కు ఇబ్బంది కలగకుండా బ్రిడ్జి నిర్మాణం చేపట్టి సర్వీస్ రోడ్డు నిర్మించుకోవచ్చని వక్ఫ్‌బోర్డు అనుమతి ఇచ్చింది. కానీ అనుమతులొచ్చి ఏడాది గడుస్తున్నా రోడ్డు నిర్మాణాన్ని జీఎమ్మార్ సంస్థ చేపట్టలేదు. దీంతో నిత్యం ఈ ప్రాంతంలో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి.

సర్వీస్ రోడ్డు పూర్తిచేయాలి



“మండల కేంద్రంలో ఖబ్రస్తాన్ వద్ద గతంలో అసంపూర్తిగా నిలిచిపోయిన సర్వీస్ రోడ్డు నిర్మాణాన్ని పూర్తిచేయాలి. ఈ ప్రాంతంలో సర్వీస్ రోడ్డు లేకపోవడంతో మండల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయాన్ని పలుమార్లు అధికార యంత్రాంగం, జీఎమ్మార్ సంస్థ దృష్టికి తీసుకువెళ్లాం. సదరు సంస్థ స్పందించకపోతే ప్రజలను సమీకరించి ఆందోళన చేపడతాం.

– చింతకాయల నాగరాజు, బీసీ సంక్షేమ సంఘం మండల నాయకుడు

బహుజనుల రాజ్యాధికారమే లక్ష్యం



మాట్లాడుతున్న పురుషోత్తమరావు

హుజూర్‌నగర్ : బహుజనుల రాజ్యాధికారమే మున్నూరు కాపుల లక్ష్యమని మున్నూరు కాపు సంఘం రాష్ట్ర అపెక్స్ కమిటీ కన్వీనర్ పి.పురుషోత్తమరావు అన్నారు. బుధవారం హుజూర్‌నగర్‌లోని టౌన్ హాల్‌లో నిర్వహించిన మున్నూరు కాపు సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో రాజ్యాధికార ప్రయత్నంలో రెండో వర్గంగా ఉన్న మున్నూరు కాపులను బలహీనపరిచేందుకు కొన్ని శక్తులు ప్రయత్నిస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. త్వరలో జరగనున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బహుజనులందరూ పూల రవీందర్‌కు మద్దతు ఇవ్వాలని కోరారు. ఆ సంఘం కోఆర్డినేటర్, మాజీ ఎంపీపీ పాలేటి రామారావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో మున్నూరు కాపు సంఘం రాష్ట్ర నాయకులు బత్తుల సిద్ధేశ్వర్, పర్వతపు సతీష్, కే.నాగేశ్వరరావు, ఆకుల రాము, కాల్వ శ్రీనివాసరావు, దూళిపాల శ్రీనివాస్, రామిశెట్టి రాము, రాయల వెంకటేశ్వర్లు, కాల్వ పెద్ద వెంకటేశ్వరరావు, కొట్టు శేఖర్, కొట్టు మోహన్‌రావు, కొట్టు బాబు, మేకల సైదయ్య, వెంకన్న, బండి నాగేశ్వరరావు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సాగు చేయని భూములు గుర్తించాలి

చిలుకూరు : గ్రామాల్లో సాగు చేస్తున్న వ్యవసాయ భూములు, సాగు చేయని భూములను గుర్తించాలని తహసీల్దార్ ధృవకుమార్ అన్నారు. బుధవారం చిలుకూరు తహసీల్దార్ కార్యాలయంలో సాగు భూముల గుర్తింపుపై రెవెన్యూ, వ్యవసాయ శాఖ అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ఒకే సర్వే నంబర్‌లో కొంత సాగు భూమి ఉండి, మరి కొంత సాగు కాని భూమి ఉంటే గుర్తించి వివరాలను నమోదు చేసుకోవాలని అధికారులకు సూచించారు. డిప్యూటీ తహసీల్దార్ కరుణశ్రీ, వ్యవసాయాధికారి శ్రీధర్, ఆర్‌ఐలు మంత్రిప్రగడ సీతారామచందర్‌రావు, శ్వేత, ఏఈఓలు చంద్రశేఖర్, శిరీష, వసీమా తదితరులు పాల్గొన్నారు.

ఇచ్చిన భూమి తీసుకోవాలనుకోవడం సరికాదు

నేరేడుచర్ల : 70 ఏళ్ల క్రితం దానం చేసిన భూమిని వారి కుటుంబ సభ్యులు తిరిగి తీసుకోవడానికి ప్రయత్నించడం సరికాదని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు పారేపల్లి శేఖర్‌రావు అన్నారు. బుధవారం నేరేడుచర్ల మండలం పత్తేపురం గ్రామంలో ప్రభుత్వం ఇచ్చిన స్థలంలో నిర్మించుకున్న ఇళ్లను సీపీఎం నాయకులు బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామంలో గల సర్వే నంబర్ 249, 258లో సుమారు 150 మంది దళితులకు 1986లో తెలుగుదేశం ప్రభుత్వం 70 గృహాలు, 2004లో కాంగ్రెస్ ప్రభుత్వం 80 గృహాలను నిర్మించి ఇచ్చిందన్నారు. ఈ గృహాలకు గ్రామ పంచాయతీకి పన్ను కూడా చెల్లిస్తున్నట్లు తెలిపారు. ఇప్పుడు ఆ భూమిలో గల ఇళ్లలో నివాసం ఉంటున్న వారికి భూమి దానం చేసిన వారి కుటుంబ సభ్యులు కోర్టు ద్వారా నోటీసులు పంపించడం సరైంది కాదన్నారు. కోర్టు నోటీసులను ఉప సంహరించుకోకుంటే సీపీఎం ఆధ్వర్యంలో ఉద్యమం చేస్తామన్నారు. సీపీఎం నాయకులు సిరికొండ శ్రీను, మర్రి నాగేశ్వర్‌రావు, సోమయ్య, వెంకటయ్య, శ్రీధర్, దేవయ్య, శ్రీను, సైదులు, వెంకయ్య, బిక్షం, మల్లారెడ్డి, శేఖర్‌రెడ్డి, సత్యం తదితరులు ఉన్నారు.

ఘనంగా ఛత్రపతి శివాజీ జయంతి వేడుకలు



కోదాడరూరల్ : ఛత్రపతి శివాజీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు



నేరేడుచర్లలో నివాళులర్పిస్తున్న స్థానికులు

కోదాడరూరల్ : ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి వేడుకలను కోదాడ పట్టణంలో విశ్వహిందూ పరిషత్, బజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాగుబండి రామ్మూర్తినగర్ నుంచి ఖమ్మం క్రాస్ రోడ్ వరకు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం బస్టాండ్ సెంటర్‌లోని శివాజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పలువురు మాట్లాడుతూ శివాజీ ధైర్యం, వీరోచిత పోరాటాన్ని భారత జాతి మరువదని అన్నారు. ఈ కార్యక్రమంలో విజయ్, సతీష్, గణేష్, నవీన్, ఉదయ్, కల్యాణ్, శ్రీహరి, వంశీకృష్ణ, అశోక్, గణేష్ ఉన్నారు.

నేరేడుచర్లలో..

నేరేడుచర్ల : హిందూ సామ్రాట్ ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి వేడుకలను బుధవారం నేరేడుచర్లలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శివాజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సైదులు, నాగేశ్వర్‌రావు, నాగిరెడ్డి, భాస్కర్, దేవిరెడ్డి నాగిరెడ్డి, రాము, శ్రీనివాస్‌రెడ్డి, అరుణ్, అనిల్‌కుమార్, వెంకటేశ్వర్లు, మధు, శ్రీను, ఎల్లయ్య, ప్రవీణ్, వీరబాబు, అశోక్, రామ్మూర్తి, నరినాయక్, నాగయ్య, నాగేశ్వర్‌రావు, రాజేష్‌రెడ్డి, శంకర్‌రెడ్డి, శ్రీరాములు, నారాయణరెడ్డి, మోహన్‌రెడ్డి, రవి, లక్ష్మణ్ తదితరులు ఉన్నారు.

చిలుకూరులో..



చిలుకూరు : బేతవోలు జెడ్పీహెచ్ఎస్‌లో..

చిలుకూరు : మండలంలోని బేతవోలులో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం ఛత్రపతి శివాజీ జయంతిని ఛత్రపతి శివాజీ యూత్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శివాజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పదవ తరగతి విద్యార్థులకు శివాజీ యూత్ తరఫున ప్యాడ్లు, పెన్నులు పంపిణీ చేశారు. అదేవిధంగా నారాయణపురం గ్రామంలో ఛత్రపతి శివాజీ జయంతి వేడుకలు నిర్వహించారు. కార్యక్రమాల్లో ఎంఈఓ గురవయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పూజల నిర్వహణకే అనుమతులు



బేతవోలులో ప్రత్యేక బలగాలతో పోలీస్ పికెట్ నిర్వహిస్తున్న ఎస్‌ఐ రాంబాబుగౌడ్

చిలుకూరు : మండలంలోని బేతవోలు గ్రామంలో ఈ ఏడాది కనకదుర్గమ్మ జాతర నిర్వహణకు పోలీసులు అనుమతులు నిరాకరించారు. ఈ నెల 20, 21, 22 తేదీల్లో మూడు రోజుల పాటు జాతర నిర్వహించాల్సి ఉంది. కానీ గ్రామంలో గత కొన్ని రోజులుగా పలు వర్గాల మధ్య వివాదాలు జరుగుతుండడంతో కోలాట ప్రదర్శనలు, ఎడ్ల పందేలు, లైటింగ్ ప్రభలు, సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహించేందుకు రాజకీయ పార్టీల నాయకులకు పోలీసులు అనుమతులు ఇవ్వలేదు. శుక్రవారం కనకదుర్గమ్మ ఆలయంలో ఉదయం ప్రత్యేక పూజలు, మొక్కులు చెల్లించుకోవాలని గ్రామస్తులకు సూచించారు. జాతర పూర్తయ్యే వరకు గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీస్ బలగాలతో బందోబస్తు ఏర్పాటు చేశారు. జాతరను ప్రశాంతగా జరుపుకోవాలని, ఎన్నికల కోడ్ ఉల్లంఘించినా, నిబంధనలను అతిక్రమించినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని కోదాడ రూరల్ సీఐ రజితారెడ్డి, చిలుకూరు ఎస్‌ఐ సురభి రాంబాబుగౌడ్ తెలిపారు.

వర్గీకరణతో మాదిగ ఉపకులాలకు మేలు



మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఫ్లెక్సీకి పాలాభిషేకం చేస్తున్న టీఎమ్మార్పీఎస్ నాయకులు

కోదాడరూరల్ : ఎస్సీ వర్గీకరణ అమలుపై రాష్ట్ర చట్టసభల్లో ఆమోదం తెలపడం హర్షణీయమని ఎమ్మార్పీఎస్ దక్షిణ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు చింత బాబుమాదిగ అన్నారు. ఎస్సీ వర్గీకరణ అమలు పట్ల హర్షం వ్యక్తం చేస్తూ బుధవారం కోదాడ పట్టణంలో మంత్రి, ఎస్సీ వర్గీకరణ కమిషన్ చైర్మన్ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి ఫ్లెక్సీకి పాలాభిషేకం నిర్వహించి మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి ఓటు బ్యాంకు రాజకీయాలు చేయకుండా సామాజిక స్ఫూర్తితో ఎస్సీ వర్గీకరణతో మాదిగ ఉపకులాలకు మేలు జరిగే విధంగా నిర్ణయం తీసుకోవడం చారిత్రాత్మకమని అన్నారు. కార్యక్రమంలో బాణాల అబ్రహం, కందుకూరి నాగేశ్వరరావు, స్వామి, ఏర్పుల శ్రావణ్, పిడమర్తి బాబురావు, శ్రీను, చంటి ఉన్నారు.

న్యాయం చేయాలని కలెక్టర్‌కు ఫిర్యాదు

కోదాడ : కనిపెంచి విద్యాబుద్ధులు నేర్పించి ప్రభుత్వ ఉద్యోగిగా చేసిన తల్లికి పట్టెడు మెతుకులు పెట్టడానికి నిరాకరిస్తున్నాడు ఓ ఉపాధ్యాయుడు. దీంతో ఆ తల్లి జిల్లా కలెక్టర్‌ను ఆశ్రయించడంతో పూర్తిస్థాయి విచారణ జరపాలని కలెక్టర్.. జిల్లా విద్యాశాఖాధికారిని ఆదేశించారు. వివరాలు.. మండలంలోని గుడిబండకు చెందిన ఇలవల అనసూర్యమ్మకు ఇద్దరు కుమారులు. వారిలో పెద్దకుమారుడు మందబుద్ధి కలవాడు కావడంతో అతనికి వివాహం చేయలేదు. చిన్న కుమారుడు చదువుకుని ప్రభుత్వ ఉద్యోగం చేస్తున్నాడు. అయితే చిన్న కుమారుడు వివాహం అయిన రెండు నెలలకే వేరే కాపురం పెట్టి తల్లిదండ్రుల బాగోగులు వదిలేశాడని, తన భర్త మరణించడంతో ప్రస్తుతం తాను, తన పెద్దకొడుకుతో కలిసి తన బిడ్డ కుమారుడి వద్ద తలదాచుకుంటున్నానని ఆమె ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. తమకు ఉన్న మూడు ఎకరాల్లో చిన్న కుమారుడికి ఒక ఎకరం, పెద్ద కుమారుడికి ఒక ఎకరం, తాను ఒక ఎకరం తీసుకున్నామని, తమ భూమిలో వ్యవసాయం చేసుకోకుండా, తమను చూడకుండా తన చిన్న కుమారుడు ఇబ్బంది పెడుతున్నాడని, ఇటీవల తమపై దాడి చేస్తే కోదాడ రూరల్ పోలీస్ స్టేషన్‌లో కేసు పెట్టినా అతను మారలేదని, దీనిపై పూర్తిస్థాయిలో విచారణ జరిపి తమకు న్యాయం చేయాలని ఆమె కలెక్టర్‌కు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొంది.

దాతల సహకారం అభినందనీయం



మాట్లాడుతున్న ఎంఈఓ సత్యనారాయణరెడ్డి

నేరేడుచర్ల : ప్రభుత్వ పాఠశాలలకు స్వచ్ఛంద, వ్యాపార సంస్థలు సహకారం అందించడం అభినందనీయమని ఎంఈఓ సత్యనారాయణరెడ్డి అన్నారు. మండలంలోని దిర్శించర్లలో గల మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలకు ఇండిగో సేవా ఉత్సవ్ (ఇండిగో పేయింట్స్ కంపెనీ) సౌజన్యంతో వెంగమాంబ ట్రేడర్స్ పచ్చ వెంగళరావు బ్రదర్స్ సూచనలతో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ యూనియన్ ఆధ్వర్యంలో పెయింటింగ్ వేయించారు. ఈ సందర్భంగా బుధవారం పాఠశాలలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఇండిగో ఉత్సవ్ మేనేజర్ సాగర్, ఎంపీడీఓ సోమ సుందర్ రెడ్డి, ఇండిగో సేవా ఉత్సవ్ సేల్స్ అధికారి జీవన్, స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎం బట్టు మధు, ప్రధానోపాధ్యాయుడు మామిళ్ల శ్రీనివాస్‌రెడ్డి, అంబేద్కర్ పెయింటింగ్ యూనియన్ అధ్యక్షుడు వరాల సైదులు, గౌరవ అధ్యక్షుడు వెంకన్న, పాఠశాల చైర్మన్ కిరణ్మయి, ఉపాధ్యాయులు నాగవాణి, స్వాతి, చల్లా ప్రభాకర్‌రెడ్డి, సంధ్య, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్ష సామగ్రి అందజేత



పరీక్ష సామగ్రి అందజేస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

గరిడేపల్లి : మండలంలోని పొనుగోడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు రిటైర్డ్ గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుడు, లయన్స్ క్లబ్ సభ్యుడు చింతకుంట్ల పూర్ణచంద్రారెడ్డి ఆర్థిక సహకారంతో లయన్స్ క్లబ్ నేరేడుచర్ల ఆధ్వర్యంలో బుధవారం పరీక్ష ప్యాడ్లు, పెన్నులు, నోట్ బుక్స్ అందజేశారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ అధ్యక్షుడు జీలకర రామస్వామి మాట్లాడుతూ పదవ తరగతిలో 10 జీపీఏ సాధించిన విద్యార్థులకు రూ.1116 అందజేస్తామని తెలిపారు. ప్రధానోపాధ్యాయులు నరసకుమారి, క్లబ్ కోశాధికారి యూసుఫ్, విశ్వనాథ్, నాగేశ్వరరావు, బుద్ధారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి క్రీడాపోటీలు

భానుపురి (సూర్యాపేట) : తెలంగాణ ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో కోదాడలో నిర్వహించే రాష్ట్ర స్థాయి క్రీడలకు జిల్లా స్థాయిలో క్రీడాకారులను ఎంపిక చేసేందుకు గాను బుధవారం సూర్యాపేట కార్యాలయంలో చెస్, క్యారం పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో సూర్యాపేట, కోదాడ, హుజూర్‌నగర్ నుంచి క్రీడాకారులు పాల్గొన్నారు. జిల్లా ప్రభుత్వ పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు ఎస్.సుదర్శన్‌రెడ్డి, బి.రాంబాబు, శ్యాంసుందర్‌రెడ్డి, అమీర్ ఖాన్, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రత పాటించాలి



బీసీ గురుకులంలో విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

నేరేడుచర్ల : ప్రతిఒక్కరూ పరిశుభ్రత పాటించాలని, పరిశుభ్రతతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని నేరేడుచర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిని నాగిని అన్నారు. బుధవారం నేరేడుచర్లలోని మహాత్మా జ్యోతిరావ్ పూలే గురుకుల పాఠశాలలో విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. 16 మంది విద్యార్థుల రక్తనమూనాలు సేకరించినట్లు తెలిపారు. 33 మంది విద్యార్థులకు జలుబు, దగ్గు ఉన్నట్లు గుర్తించామన్నారు. అవసరమున్న విద్యార్థులకు ఉచితంగా మందులు పంపిణీ చేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ల్యాబ్ టెక్నీషియన్ శారద, హెల్త్ అసిస్టెంటు నర్సయ్య, ఆశా కార్యకర్త విజయరాణి, ప్రిన్సిపాల్ శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

సబ్ జూనియర్ బాలబాలికల కబడ్డీ జట్టు ఎంపిక

గరిడేపల్లి : వికారాబాద్ జిల్లా కేంద్రంలో ఈ నెల 20 నుంచి 23 వరకు జరగనున్న రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు సబ్ జూనియర్ బాలబాలికల జట్టును ఎంపిక చేసినట్లు కబడ్డీ అసోసియేషన్ జిల్లా కమిటీ చైర్మన్ బి.భూలోకరావు, కన్వీనర్ కర్తయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని రాయినిగూడెం గ్రామంలో జరిగిన కబడ్డీ క్రీడా పోటీల్లో జట్టును ఎంపిక చేసినట్లు తెలిపారు.

వృద్ధులకు ఫించన్లు మంజూరు చేయాలి

గరిడేపల్లి : వృద్ధులకు ఫించన్లు మంజూరు చేయాలని సీపీఎం మండల కార్యదర్శి ఎస్‌కే యాకూబ్ అన్నారు. బుధవారం మండలంలోని అప్పిరెడ్డిగూడెం గ్రామంలో పందిరి వీరారెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సీపీఎం జనరల్ బాడీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం ఆరు గ్యారంటీలు అమలు చేయడంలో విఫలమైందని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి సంవత్సరం దాటినా కొత్త పెన్షన్ల విషయంలో ఎలాంటి నిర్ణయం తీసుకోకపోవడం బాధాకరమని అన్నారు. ఈ కార్యక్రమంలో వీరస్వామి, పెంటయ్య, వీరారెడ్డి, రాంబాబు, అప్పారావు, లింగయ్య, లచ్చయ్య, గోపి, భారతి, మంగమ్మ, హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యమే మహాభాగ్యం

హుజూర్‌నగర్ : ఆరోగ్యమే మహాభాగ్యం అని హెల్త్ సూపర్‌వైజర్ చల్లా పద్మ అన్నారు. పోషణ్ అభియాన్‌లో భాగంగా బుధవారం హుజూర్‌నగర్‌లో పట్టణంలోని 5వ అంగన్‌వాడీ కేంద్రంలో ఆరోగ్య అలవాట్లపై ఆయన అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రతిరోజూ చేతులు ఎలా శుభ్రం చేసుకోవాలో గర్భిణులు, బాలింతలు, తల్లులు, పిల్లలకు ఆయన అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ ఆకుల రజని, ఏఎన్‌ఎం లలిత, ఆశా వర్కర్లు సుజాత, జ్యోతి, నిర్మల, సుశీల, తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



మునగాల : క్షయ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది

గరిడేపల్లి : వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వైద్యాధికారి నరేష్ అన్నారు. నిక్షయ్ శివిర్ కార్యక్రమంలో భాగంగా బుధవారం మండలంలోని మంగాపురం గ్రామంలో టీబీ అనుమానిత లక్షణాలు ఉన్న వారికి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా 40 మందికి తెమడ పరీక్షలు, హెచ్‌ఐవీ టెస్టులు, బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో పీహెచ్‌ఎన్ శారద, సూపర్‌వైజర్ అంజయ్యగౌడ్, అశోక్, సాయి, ఉపేందర్, సుమిత్ర, మమత, సరస్వతి, రాజకుమారి, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బరాఖత్‌గూడెంలో క్షయ నిర్ధారణ పరీక్షలు

మునగాల : నిక్షయ్ శివిర్ కార్యక్రమంలో భాగంగా మునగాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని బరాఖత్‌గూడెం గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణలో బుధవారం వైద్య సిబ్బంది క్షయ నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా మునగాల పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్.పి.రవీందర్ మాట్లాడుతూ.. ఎడ తెరిపిలేని దగ్గు, జ్వరం, ఆయాసం, ఆకలి మందగించడం, బరువు కోల్పోవడం వంటి లక్షణాల్లో ఒకటి లేదా రెండు ఉంటే వెంటనే వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. బరాఖత్‌గూడెంలో 60 మంది నుంచి తెమడ శ్యాంపిల్స్ తీసుకున్నామని, 60 మందికి ఎక్స్‌రే పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కె.రమేష్ దీనదయాళ్, టీబీ సూపర్‌వైజర్లు ఎస్టీఎల్‌ఎస్ పిడమర్తి సైదులు, ఎస్‌టీఎస్ సుభాషిణి, ల్యాబ్ టెక్నీషియన్ సతీష్, ఏఎన్‌ఎంలు భానుమతి, మమత, సరిత, గ్రామపంచాయతీ కార్యదర్శి దేవరం శ్వేత, రిటైర్డ్ ప్రధానోపాధ్యాయుడు ఓరుగంటి రవి, ఆశా కార్యకర్తలు లింగమ్మ, కె.రమణమ్మ, సైదమ్మ, లక్ష్మి పాల్గొన్నారు.

మిర్చి క్వింటాకు రూ.25 వేలు ఇవ్వాలని వినతి




చింతలపాలెం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న రైతు సంఘం నాయకులు

హుజూర్‌నగర్ (చింతలపాలెం) : మిర్చికి క్వింటాకు రూ.25 వేలు ధర చెల్లించాలని రైతు సంఘం తెలంగాణ రాష్ట్ర కమిటీ సభ్యుడు పల్లె వెంకటరెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం రైతు సంఘం ఆధ్వర్యంలో చింతలపాలెం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేసి తహసీల్దార్ సురేందర్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆరు కాలం కష్టపడి పండించిన మిరప పంటకు గిట్టుబాటు రాక రైతులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు లేక, మిర్చి నిల్వ చేసేందుకు గిడ్డంగులు లేక ప్రైవేటు గిడ్డంగులను ఆశ్రయించాల్సి వస్తుందని ఆయన తెలిపారు. ప్రైవేటు గోదాముల కిరాయి తగ్గించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు కె.సుందర మల్లేశ్వరరెడ్డి, వట్టెపు సైదులు, జంగాల పుల్లయ్య, యరబోలు గోవిందరెడ్డి, జానిమియా, వెంకన్న, మక్బుల్, మంగయ్య, భాస్కర్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాల అమలులో ప్రభుత్వం విఫలం

గరిడేపల్లి : రైతు సంక్షేమ పథకాలను అమలు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని సీపీఐ మండల కార్యదర్శి పోకల వెంకటేశ్వర్లు ఆరోపించారు. ప్రభుత్వ వైఫల్యాపై నిరసనగా బుధవారం మండలంలోని గానుగబండ రైతు వేదిక వద్ద సీపీఐ ఆధ్వర్యంలో ధర్నా చేసి ఏఈఓ త్రివేణికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్‌పార్టీ అధికారంలోకి వచ్చి రెండు ఏళ్లు అవుతున్నా రైతులకు పెట్టుబడి సహాయం అందించడం లేదని అన్నారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యవర్గ సభ్యులు కడియాల అప్పయ్య, కుందూరు వెంకటరెడ్డి, ఏఐవైఎఫ్ నాయకులు పంగ సైదులు, మెండే లింగరాజు, షేక్ ఖాసీం, రామాచారి, రామచంద్రయ్య, షేక్ పెదఖాసీం, పసుపులేటి సైదులు తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం.. పుణ్యకార్యం



అన్నదానం చేస్తున్న వేమూరి సత్యనారాయణ

మునగాల : అనాథలకు అన్నదానం చేయడం పుణ్యకార్యమని నర్సింహాపురం గ్రామానికి చెందిన సామాజిక కార్యకర్త డాక్టర్ వేమూరి సత్యనారాయణ అన్నారు. హైదరాబాద్ నగరంలోని బాచుపల్లికి చెందిన గాదె శ్రీనివాసరెడ్డి జ్ఞాపకార్థం భార్య రమాదేవి, కుటుంబసభ్యుల సహకారంతో బుధవారం మునగాల మండలంలోని ముకుందాపురం గ్రామ పరిధిలో గల ఇందిర అనాథ వృద్ధాశ్రమంలో ఆయన అన్నదాన కార్యక్రమం నిర్వహించి మాట్లాడారు. ఈ చెరుకుపల్లి నాగేశ్వరరావు, ఆశ్రమ నిర్వాహకురాలు నాగిరెడ్డి విజయమ్మ, వాచేపల్లి జ్యోతి పాల్గొన్నారు.

రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం

నడిగూడెం : ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల పాలకవర్గాల పదవీకాలాన్ని రాష్ట్ర ప్రభుత్వం పొడిగించడంపై హర్షం వ్యక్తం చేస్తూ నడిగూడెం మండలంలోని తెల్లబల్లి పీఏసీఎస్ కార్యాలయంలో బుధవారం రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం చైర్మన్ బుర్రా వెంకటేశ్వర్లు, వైస్ చైర్మన్ కొల్లు వీరయ్య, సీఈఓ ప్రభాకర్‌రావు, పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.